సాక్షి
జనగామ

ఆదివారం । 6 । ఆగస్టు । 2023



మణిపూర్‌లో నాజీల పాలన

మణిపూర్‌లో నాజీల పాలన సాగుతోందని రచయిత్రి కూర్పినా కిమ్మోవా అన్నారు. హనుమకొండలో ఏర్పాటు చేసిన భారత్ బచావో సదస్సులో ఆమె మాట్లాడారు. - 10లో▸



ఆటోల దొంగ అరెస్ట్

ఆటోలను అపహరించే నిందితుడు దండ్ల గణేష్‌ను స్టేషన్‌ఘన్‌పూర్‌లో శనివారం అరెస్ట్ చేసినట్లు సీఐ ఆలె రాఘవేందర్ తెలిపారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం
$34^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు కాస్త పెరుగుతాయి.

న్యూస్‌రీల్

వైభవంగా వారకల్యాణం



చిల్పూరు: శ్రీబుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శనివారం వారకల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఏపీ రాష్ట్రం పల్నాడు జిల్లాకు చెందిన హనుమంత రావు–సుజాత దంపతులు, వారి కుమార్తెలు కావ్యశ్రీ, తేజమని అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ శ్రీధర్‌రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విలీన బిల్లు పెట్టి ఆమోదించాలి



జనగామ రూరల్: ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ మంత్రి వర్గ సమావేశంలో బిల్లు పెట్టి ఆమోదించాలని టీఎంయూ రాష్ట్ర కార్యదర్శి గిరిమల్లె రాజు అన్నారు. శనివారం జనగామ డిపో ఎదుట బస్సులు నిలిపివేసి ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న అన్ని కేటగిరీల్లోని ఆర్టీసీ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం ఇచ్చిన హామీ వెంటనే అమలు చేస్తూ గవర్నర్‌తో ఆమోదముద్ర పడేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి ఎల్ఎల్.పతి, ఎంబీకే.రెడ్డి, శివరాత్రి దుర్గయ్య, బి.రాజు, యాదగిరి, యగేందర్, మాధవి, ప్రమీల, సమ్మక్క, రమ తదితరులు పాల్గొన్నారు.

నేడు కరీంనగర్ సాహితీవేత్తల రాక

పాలకుర్తి టౌన్: ఉమ్మడి కరీంనగర్ నుంచి సాహితీ వేత్తలు ఆదివారం పాలకుర్తికి రానున్నారు. 170 మంది కవులు, రచయితలు, కళాకారులు సభ్యులుగా ఉన్న ఈ బృందం తెలంగాణ ఆదికవి పాల్కురికి సోమనాథుడు, సహజ పండితుడు బమ్మెర పోతన, వల్మిడి, గూడూరు తదితర ప్రదేశాలను సందర్శించనున్నారు. ఈ సందర్భంగా భోజరాజకీయం గ్రంథావిష్కరణ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సాహితీ వేత్తలు నంది శ్రీనివాస్, కొత్త అనిల్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని సోమనాథ కళాపీఠం అధ్యక్షుడు రసన కోరారు.

స్టేట్ అథ్లెటిక్స్ మీట్‌కు విద్యార్థుల ఎంపిక



జనగామ : హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈనెల 7న జరిగే స్టేట్ అథ్లెటిక్స్ మీట్‌కు జనగామ స్కాలర్ గ్రామర్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. శనివారం పట్టణంలోని ధర్మకంచ మినీస్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ 100 మీటర్ల పరుగు పోటీల్లో అభి, లక్కీ, జావలిన్ త్రోలో శివర్ధన్ మొదటి స్థానంలో గెలుపొందారు. వారిని స్కూల్ కరస్పాండెంట్ తుమ్మ నీరజజగన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మంజుల తదితరులు అభినందించారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



జనగామ: సుప్రీం కోర్టులో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ అనర్హత వేటు విషయంలో స్టే ఇవ్వడంతో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఆదేశం మేరకు శనివారం స్థానిక రైల్వేస్టేషన్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు బాణసంచా కాల్చి మిఠాయి పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాసంపల్లి లింగాజీ మాట్లాడుతూ సత్యమే గెలుస్తుందనేది నిజమైందని, దేశంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ కుటిల రాజకీయాలకు ప్రజలు ఓటు అనే ఆయుధం ద్వారా తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, అనుబంధ సంఘాల నాయకులు కొన్నే మహేందర్‌రెడ్డి, చింతకింది మల్లేష్, ఎండీ. మాజీద్, జాఫర్‌షరీఫ్‌తోపాటు కట్ట కృష్ణ, రంగు రవి, రఘు, ఠాగూర్, సుల్తాన్, గోవింద్‌రెడ్డి, పండ్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఊరు హితానికి ఆ నలుగురు..



చిన్ననాటి స్నేహితులతో సీఐ శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

రఘునాథపల్లి: ఆ నలుగురు స్నేహానికి కొత్త అర్థాన్నిస్తున్నారు. సొంత ఊరికోసం పాటు పడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పల్లె మట్టి వాసనలు మరవని ఆ నలుగురిలో జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఒకరు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆయన శనివారం తన చిన్న నాటి జ్ఞాపకాలను 'సాక్షి'తో పంచుకున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే.. స్వగ్రామమైన కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం రంగపేటలో చిన్ననాటి స్నేహితులు రాజు, సాయి, శ్రీనివాస్‌తో కలిసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. గ్రామంలో మినరల్ వాటర్‌ప్లాంట్, హనుమాన్ ఆలయ నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, యువకులకు హెల్మెట్ల పంపిణీ, నిరుద్యోగులకు స్టడీ మెటీరియల్ అందజేత, పేదలు మరణిస్తే వారి కుటుంబాలకు చేయూత అందిస్తున్నాం. 2022లో స్టేషన్‌ఘన్‌పూర్‌లో మెగాజాబ్ మేళా నిర్వహించి 780 మంది నిరుద్యోగులకు వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాం. ముందుముందు మరిన్ని కార్యక్రమాలు చేపడతాం.

స్నేహితం

- కష్టాల్లో ఉన్న స్నేహితులకు ఆపన్నహస్తం
- సామాజిక మాధ్యమాల ద్వారా హెల్పింగ్ హ్యాండ్స్
- ఎంత స్థాయికి ఎదిగినా బచ్‌పన్ దోస్తులను వీడని వారెందరో..

నేడు స్నేహితుల దినోత్సవం సందర్భంగా మరిన్ని కథనాలు 10లో▸

ముగ్గురు మనుషులు.. మనసు ఒక్కటే..



రాజయ్య, బాలరాజు, సంజీవరెడ్డి

బచ్చన్నపేట: ముగ్గురు మిత్రులు.. తమ కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటూ స్నేహానికి మారుపేరుగా నిలుస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన కొత్తపల్లి రాజయ్య, గుర్రం బాలరాజు, పెద్దచిట్టి సంజీవరెడ్డి ఇంటర్ వరకు కలిసి చదువుకున్నారు. అనంతరం ముంబయి వెళ్లిన బాలరాజు హిందీ పండిట్‌గా రిటైర్ అయి అక్కడే వేదపండితుడిగా సేవలందిస్తున్నాడు. రాజయ్య దేవస్థాన కమిటీ చైర్మన్‌గా పనిచేసి ప్రస్తుతం వ్యాపారంలో స్థిరపడగా.. సంజీవరెడ్డి వినియోగదారుల ఫోరం అధ్యక్షుడిగా ఉంటూ వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఈ ముగ్గురు మిత్రులు ఏ తీర్థయాత్రకు వెళ్లినా కలిసి కలిసే పోతారు. ముంబయిలో ఉండే బాలరాజు ప్రతిఏటా కుటుంబ సమేతంగా బచ్చన్నపేటకు వచ్చి మిత్రులతో గడిపివెళ్తాడు. మనుషులు ముగ్గురైనా మనసులు ఒక్కటే అన్నట్లుగా కష్టసుఖాల్లో పాలు పంచుకుంటున్న వీరు ఏడు పదుల వయసులోనూ స్నేహంతో ఆదర్శంగా నిలుస్తున్నారు.

రైతు బీమాతో ధీమా

పట్టాదార్ పాస్‌పుస్తకం ఉన్న రైతులందరూ అర్హులే..

- సాధారణ, ప్రమాదవశాత్తు మరణించినా రూ.5 లక్షల బీమా
- కొత్త వారికి ముగిసిన దరఖాస్తు గడువు
- జిల్లాలో 1.03 లక్షల మంది నమోదు




జనగామ: రైతు బీమా అన్నదాతలకు ధీమానిస్తుంది. రైతుబంధుతో పెట్టుబడి సాయం అందజేస్తున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వం.. అన్నదాత అకాల మరణం చెందితే.. కుటుంబం రోడ్డున పడకుండా 2018లో బీమా పథకానికి శ్రీకారం చుట్టింది. ఎల్ఐసీకి బీమా ప్రీమియం డబ్బులను ప్రభుత్వమే చెల్లించి.. రైతు కుటుంబానికి ఉచితంగా ఆర్థిక భద్రత కల్పిస్తున్నది. కొత్తగా పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందిన రైతులు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 4వ తేదీ వరకు ఇచ్చిన గడువు ముగిసింది. జిల్లాలో రైతుబీమా పథకం కింద 1,10,356 మంది రైతులు ఉన్నారు. ప్రభుత్వం ఒక్కో రైతుకు ఎల్ఐసీకి బీమా ప్రీమియం రూ.3,556 చెల్లిస్తుంది. ఈ లెక్కన ప్రస్తుతం జిల్లాలో ఉన్న రైతులకు బీమా ప్రీమియం కింద ఎల్ఐసీకి సుమారు రూ.36.77 కోట్లు చెల్లించింది. రైతు సాధారణంగా, ప్రమాదవశాత్తు మరణం సంభవించినా రూ.5 లక్షల బీమా వర్తింపజేస్తారు. ఇందుకు సంబంధించి ఎల్ఐసీ నిబంధనలు అనుసరించి.. మృతి చెందిన రైతు నామినీకి బీమా సొమ్ము చెక్కు అందజేస్తారు. ప్రతి ఏటా జూలై రెండో వారం నుంచి ఆగస్టు మొదటి వారం వరకు కొత్తగా పట్టాదారు పుస్తకం పొందిన రైతులకు బీమాకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. జూన్ 18వ తేదీ లోపు సదరు రైతు వ్యవసాయ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకుని ఉండాలి. అలాగే 18 నుంచి 59 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన వారు మాత్రమే దీనికి అర్హులు. పట్టాదార్ పుస్తకం, ఆధార్ కార్డుతో పాటు స్థానిక ఏఈఓలను సంప్రదిస్తే.. విచారణ తదుపరి రైతుబీమాలో పేర్లను నమోదు చేసి, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఈసారి చివరి గడువు వరకూ మండలాల వారీగా రైతులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

2,494 మంది మృతుల కుటుంబాలకు బీమా

2018 నుంచి ప్రస్తుతం వరకు జిల్లాలో 2,616 మంది చనిపోగా, 2,494 మంది బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రూ.124.70 కోట్ల చెక్కులను అందించారు. ఇందులో ఈ ఏడాది చనిపోయిన మరో 122 మంది మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల బీమా చెక్కులు అందాల్సి ఉంది.

జిల్లాలో 2018 నుంచి 2023 వరకు బీమా సొమ్ము పొందిన రైతు కుటుంబాల వివరాలు



జిల్లాలో రైతు బీమా స్కీంలో ఉన్న రైతుల వివరాలు

మండలం	పాత రైతులు	కొత్త రైతులు
దేవరుప్పుల	1,112	714
పాలకుర్తి	16,596	1,143
కొడకండ్ల	6,653	426
నర్మెట్ట	6,977	730
తరిగొప్పుల	5,810	599
చిల్పూర్	8,717	436
స్టేషన్‌ఘన్‌పూర్	9,327	674
జనగామ	10,907	1,190
రఘునాథపల్లి	13,028	1,101
లింగాలఘణపురం	9,838	896
బచ్చన్నపేట	11,221	896
జఫర్‌గఢ్	10,170	786
మొత్తం	1,10,356	9,592

ప్రతి ఏడాది అవకాశం.. అర్హులంతా వినియోగించుకోవాలి



జూన్ 18వ తేదీలోపు వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ చేసుకుని, 18 నుంచి 59 ఏళ్ల లోపు వయస్సు కలిగిన రైతులు బీమాకు అర్హులు. అర్హత ఉండి, కొత్తగా పట్టాదార్ పుస్తకం పొందిన రైతులకు ప్రతి సంవత్సరం బీమా పథకంలో చేరడానికి అవకాశం కల్పిస్తున్నాం. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– వినోద్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

ఖైదీలు సమాజానికి ఆదర్శంగా నిలవాలి



సబ్‌జైలులో మాట్లాడుతున్న జడ్జి సుచరిత



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న జడ్జి విక్రమ్

- జూనియర్ సివిల్ జడ్జి సుచరిత

జనగామ రూరల్: ఖైదీలు క్రమశిక్షణతో ఉండి సమాజానికి ఆదర్శంగా నిలవాలని జూనియర్ సివిల్ జడ్జి ఇ.సుచరిత అన్నారు. శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రవీంద్రశర్మ ఆదేశాను సారం సబ్‌జైలును సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీల ఆరోగ్యానికి సంబంధించి, స్టోర్ రూం, వంట గది, మెనూ వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఖైదీలకు న్యాయ పరమైన బాధ్యతల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ కృష్ణకాంత్, డిఫెన్స్ న్యాయవాది రవీందర్, జ్యోత్స్న, శ్రీహరి పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ

జిల్లాలోని పారా లీగల్ వలంటర్లకు, ప్యానల్ లాయర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ హాజరై వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు.

మార్కుల ఆధారంగా రెగ్యులరైజేషన్



శ్రీపతిపల్లి పల్లెప్రకృతి వనంలో రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

చిల్పూరు: నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయడానికి వారు గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులు, రికార్డులను పరిశీలిస్తున్నాం.. మార్కుల ఆధారంగా రెగ్యులరైజేషన్ ఉంటుందని అదనపు కలెక్టర్ సుహాసిని అన్నారు. మండల పరిధి గార్లగడ్డతండా, వెంకటేశ్వరపల్లి, రాజవరం, శ్రీపతిపల్లి గ్రామాల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు రంగారెడ్డి, కొత్త శ్రీకాంత్, హైమావతి, పూల శ్రీకాంత్ నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నారు. ఆయా జీపీల్లోని రికార్డులు, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీ, శ్మశానవాటిక, సెగ్రిగేషన్‌షెడ్లు, ఎవెన్యూ, కమ్యూనిటీ ప్లాంటేషన్లను ఆమె శనివారం పరిశీలించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేసిన పనుల పూర్తి సమాచారాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాప్ ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. వీటికి 100 మార్కులుంటాయని.. ఎక్కువ సాధించిన వారికి రెగ్యులైజేషన్ ఉంటుందని అన్నారు. సమావేశంలో డీపీఓ రంగాచారి, ఎఫ్ఆర్ఓ మురళీధర్, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీఓ మధుసూదన్, ఎస్సై వినయ్‌కుమార్, సర్పంచ్‌లు కేశిరెడ్డి ప్రత్యూషారెడ్డి, కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థి యువగర్జన మహాసభను విజయవంతం చేయాలి

జనగామ రూరల్: ప్రభుత్వ విద్యా వ్యవస్థను రక్షించుకోవడానికి జిల్లా కేంద్రంలో ఈనెల 18వ తేదీన తలపెట్టిన జిల్లా విద్యార్థి యువగర్జన మహాసభను విజయవంతం చేయాలని జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు పిలుపునిచ్చారు. జనగామ పట్టణంలోని ఏబీవీ జూనియర్ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన జిల్లా విద్యార్థి జేఏసీ నాయకుల సమావేశంలో ఆయన మహాసభ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. మహాసభకు జిల్లా వ్యాప్తంగా అన్ని కళాశాలల నుంచి విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ కన్వీనర్ పిట్టల సురేష్, టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు గన్ను కార్తిక్, జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగ కౌశిక్, పట్టణ అధ్యక్షుడు వేంపటి అజయ్, పీఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి కోండ్ర ప్రవీణ్, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న జనగామ రైల్వేస్టేషన్



జనగామ రైల్వేస్టేషన్‌లో ఏర్పాట్లు

జనగామ రూరల్: అమృత్ భారత్ పథకంలో భాగంగా జనగామ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను ఆదివారం ఉదయం 9.30 గంటలకు ఢిల్లీ నుంచి ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించిన కేంద్రం మొదటి విడతలో రూ.24.50 కోట్లు విడుదల చేసింది. ఇందుకు సంబంధించి దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ప్రధాని కార్యక్రమాన్ని ప్రజలు తిలకించే విధంగా స్టేషన్ ఆవరణలో భారీ స్క్రీన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమున, ఇతర ప్రజాప్రతినిధులు, రైల్వే ఉన్నతాధికారులు హాజరుకానున్నారు.

సర్కారు స్కూళ్లకు పూర్వవైభవం తేవాలి

- జిల్లా విద్యాధికారి రాము



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డీఈఓ

దేవరుప్పుల: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా బోధన కొనసాగిస్తూ సర్కారు స్కూళ్లకు పూర్వవైభవం తేవడానికి ఉపాధ్యాయులు అంకితభావంతో పాటుపడాలని జిల్లా విద్యాధికారి కె.రాము అన్నారు. శనివారం మండల పరిధి కామారెడ్డిగూడెం స్కూల్ కాంప్లెక్స్‌లో 'తొలిమెట్టు' శిక్షణ తరగతులను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఉపకరణాలతో విద్యాబోధన చేస్తూ విద్యాశాఖ రూపొందించిన వర్క్‌షీట్ పురోగతి కోసం కృషి చేయాలని చెప్పారు. సమాజంలో ఉన్నత విలువ కలిగిన విద్యాశాఖకు వన్నెతెచ్చేలా నూతన సంస్కరణలను వినియోగించుకుంటూ విద్యాభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి ఉపేందర్, కోర్సు డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎంలు శ్రీలత, సిబ్బంది రవీందర్ రెడ్డి, బుర్ర యాకస్వామి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నిత్య విద్యార్థుల్లా ఉండాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ఉపాధ్యాయులు నిత్య విద్యార్థుల్లా ఉండాలని జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఎమ్మార్సీలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న రెండవ విడత 'తొలిమెట్టు' శిక్షణ శిబిరాన్ని, చేనేత వారోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి వ్యాసరచన పోటీలను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయులకు శిక్షణ ఎంతో అవసరమని, తద్వారా బోధనలో వచ్చిన కొత్త పద్ధతులను తరగతి గదిలో అమలు పరిచి విద్యార్థులను గొప్ప అభ్యాసకులుగా తీర్చిద్దడానికి దోహద పడుతుందని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధనాపద్ధతులు, వ్యూహాలకు పదును పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ మండల నోడల్ అధికారి ఎండీ.అజామొహీనొద్దీన్, కోర్సు ఇన్‌చార్జ్ కొమురయ్య, ఆర్‌పీలు రాజేందర్, మధుబాబు, ఎమ్మార్సీ సిబ్బంది గిరి, సునీత, లవ్, శ్రీలత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని నిధులిస్తే అభివృద్ధిలో అగ్రగామి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

జనగామ : పట్టణానికి మరిన్ని నిధులు కేటాయిస్తే అభివృద్ధిలో మున్సిపాలిటీ అగ్రగామిగా నిలుస్తుందని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాకముందు కరువు కాటకాలతో విలవిల్లాడిన జనగామ ప్రత్యేక జిల్లా ఏర్పాటుతో అభివృద్ధిలో ముందుకు వెళ్తోందన్నారు. పరిపాలనా సౌలభ్యం, మెడికల్ కళాశాల, తాగు సాగునీరు కల్పనకు సీఎం శ్రీకారం చుట్టారని, ఆయన చొరవతో రంగప్ప చెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దామని చెప్పారు. పలు అసంపూర్తి పనులకు రూ.30కోట్లు కేటాయించాలని కోరగా.. స్పీకర్ సానుకూలంగా స్పందించి సదరు మంత్రులకు పురోగతి చర్యలకు సూచించారు.

అసెంబ్లీలో నెల్లుట్ల గ్రామ ప్రస్తావన

- అవార్డు అందుకున్న ఫొటో ప్రదర్శించిన మంత్రి కేటీఆర్



నెల్లుట్ల సర్పంచ్ అవార్డు అందుకున్న ఫొటో చూపుతున్న కేటీఆర్

లింగాలఘణపురం: నెల్లుట్ల జీపీ సర్పంచ్ ఇటీవల జాతీయ స్థాయిలో నీటి సమృద్ధిపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్న అవార్డు విషయాన్ని శనివారం అసెంబ్లీ సమావేశాల్లో ఐటీ, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కేటీఆర్ ప్రస్తావించారు. జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్రం సాధించిన అభివృద్ధిపై స్వయంగా కేంద్ర ప్రభుత్వం అందజేసిన 30కి పైగా అవార్డుల్లో తెలంగాణకు వచ్చాయని వివరిస్తూ నెల్లుట్ల సర్పంచ్ చిట్ల స్వరూపరాణి రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్న అవార్డు ఫొటోను ప్రదర్శించారు. మంత్రి స్వయంగా జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం నెల్లుట్ల జీపీ సాధించిన ఘనతను వివరించడంతో టీవీల్లో చూసిన ప్రేక్షకులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

మున్సిపాలిటీ త్వరగా చేయాలి

- అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే రాజయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌ను త్వరగా మున్సిపాలిటీ చేయాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అసెంబ్లీలో శనివారం కోరారు. రాష్ట్ర అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో భాగంగా జీరో అవర్‌లో ఎమ్మెల్యే మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్‌తో పాటు శివునిపల్లి, ఛాగల్లు జీపీలను కలుపుకుని ఘన్‌పూర్ మున్సిపాలిటీ చేయాలని గతంలో ప్రతిపాదనలు పంపించామని గుర్తుచేశారు. ఈ విషయమై మంత్రి కేటీఆర్ గతంలో హామీ ఇచ్చారని, ఈ మూడు గ్రామాల్లో కలిపి దాదాపు 2,300 జనాభా ఉందన్నారు. ఆయా జీపీల నుంచి సమ్మతిని తెలుపుతూ తీర్మాన పత్రాలు అందజేసినట్లు వివరించారు. ఇదిలా ఉండగా.. గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెపై సానుకూలంగా స్పందించి సముచిత న్యాయం చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు.

సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

జనగామ రూరల్: సెకండ్ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించి రెగ్యులరైజ్ చేసి ఆదుకోవాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ నీర్మాల రత్నం, సీపీఐ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ర్యాలీగా కలెక్టరేట్ వరకు చేరుకున్న అనంతరం ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ సెకండ్ ఏఎన్ఎంలకు ఇచ్చిన హామీని అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించి అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్, కుమార్, మహేందర్, చంద్రశేఖర్, అశోక్, దేవయ్య, రవికుమార్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

మాంగళ్య షాపింగ్‌మాల్ చేయూత



చీరలను పంపిణీ చేస్తున్న నమశ్శివాయ

ఎస్ఎస్ తాడ్వాయి: మండలంలోని మేడారం, ఊరట్టం, కన్నెపల్లి గ్రామాల్లోని వరద బాధితులకు హనుమకొండలోని మాంగళ్య షాపింగ్‌మాల్ నిర్వాహకులు శనివారం చేయూతనిచ్చారు. బాధితులకు చీరలు అందించి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా మాంగళ్య షాపింగ్‌మాల్ చైర్మన్ కాసం నమశ్శివాయ మాట్లాడుతూ ఇటీవల వరదలకు సర్వస్వం కోల్పోయిన బాధితులకు తనవంతు సాయంగా 1500 చీరలు అందించామన్నారు. దాతలు స్పందించి వరద బాధిత కుటుంబాలను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తుమ్మ ప్రభాకర్‌రెడ్డి, మృగసి యాడ్స్ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.


జెడ్పీటీసీపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: అధికార బీఆర్ఎస్ పార్టీకి చెందిన నెల్లికుదురు జెడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాస్‌రెడ్డిపై తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. మహబూబాబాద్ పట్టణంలోని సర్వే నంబర్ 551/1, 551/2 లో ఉన్న 6 ఎకరాల ప్రభుత్వ భూమిలో ప్లాట్లు చేసి అధికార పార్టీకి చెందిన నెల్లికుదురు జెడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాస్ రెడ్డి విక్రయిస్తున్నట్లు అధికార పార్టీకి చెందిన మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు గతంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్, ఆర్ఐ రహమాన్ విచారణ చేపట్టి ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈక్రమంలో జెడ్పీటీసీతోపాటు మరికొందరిపై ఐపీసీ 447, 427 సెక్షన్ల కింద మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు.

హత్యాయత్నంలో..

నెల్లికుదురు : భార్యపై హత్యాయత్నం చేసిన భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. శనివారం ఎస్సై వివరాలు వెల్లడించారు. మండల కేంద్రానికి చెందిన దోమల రాజయ్య– కమలమ్మ దంపతులు జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో రాజయ్య ఓ మహిళతో 10 ఏళ్ల క్రితం వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో కమలమ్మతో గొడవలు మొదలయ్యాయి. పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి కమలమ్మ వేరుగా ఉండాలని తీర్మానం చేశారు. ఈ నెల 4న రాత్రి 9 గంటలకు కమలమ్మ ఉంటున్న ఇంట్లోకి వెళ్లాడు. అంతకు ముందే కమలమ్మ తయారు చేసి పెట్టుకున్న టమాట పచ్చడిలో విషం కలిపాడు. కమలమ్మ పచ్చడిని పోపు చేద్దామని వేస్తుండగా పొంగుతూ నురుగ వస్తుండటంతో అనుమానం వచ్చిచూడగా ఏదో వాసన వచ్చింది. వెంటనే తన భర్త చంపడానికి తను తినే పచ్చడిలో మందు కలిపినట్లు పోలీస్‌స్టేషన్‌లో కమలమ్మ ఫిర్యాదు చేయగా రాజయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

స్నేహితం



- మిత్రులకు అండగా..
- ఆపదలో తోడుగా..
- ఏళ్లుగా కొనసాగుతున్న ఎన్నో స్నేహబంధాలు
- నేడు స్నేహితుల దినోత్సవం

మన కోసం మనం ఎంపిక చేసుకునే ఓ అద్భుత బంధం స్నేహబంధం. తల్లిదండ్రులు జన్మను.. తోబుట్టువులను ఇస్తే.. స్నేహితులను మాత్రం మన అభిరుచికి తగ్గట్టుగా మనమే ఎంచుకునే అవకాశం ఉంటుంది. చిన్ననాటినుంచి కలిసిమెలిసి ఉంటూ.. ఒకరికి ఒకరుగా తోడుండేవారే స్నేహితులు. పాఠశాల.. ఇంటి పక్కన వారితోనో మాత్రమే కాకుండా కొన్నిసార్లు ప్రయాణాల్లో పరిచయమ్యే వారు స్నేహితులుగా ఉండేవారు.. కానీ, ప్రస్తుతం పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో ఆన్‌లైన్ పరిచయాలతోకూడా స్నేహం కొనసాగిస్తున్నారు.. ఎంత వయస్సు పెరిగినా.. ఏరా.. ఒరేయ్.. అని పిలిచే స్నేహితులు ఉంటే జీవితం ఎంతో ఆనందంగా ఉంటుందంటారు.. ఆ మధురమైన పిలుపును ఆస్వాదించే అనేకమంది. ఈనేపథ్యంలో నేడు 'స్నేహితుల దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం.

కష్టాల్లో తోడుగా ఉంటూ..



కేసముద్రం : మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న బాల్యమిత్రులు (ఫైల్)

కేసముద్రం: ఆపదలో ఉన్న బాల్యమిత్రుల కుటుంబాల కన్నీళ్లను తుడుస్తూ స్నేహమంటే సంతోషంలోనే కాదు, కష్టాల్లో కూడా తోడుగా ఉంటూ స్నేహమంటే ఇదేరా.. అని చాటుతున్నారు కేసముద్రంస్టేషన్ జెడ్పీఎస్ఎస్ 1993–94 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు. కేసముద్రం విలేజ్‌కి చెందిన 20 మంది పూర్వవిద్యార్థులు 1998లో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి మిత్రుల్లో ఎవరికి ఆపద వచ్చినా ఆదుకోవాలని ఆ మిత్రులు నిర్ణయించుకున్నారు. కేసముద్రం విలేజ్ నుంచి మొదలైన అసోసియేషన్ క్రమంగా మండల స్థాయి వరకు ఏర్పాటైంది. బ్యాచ్‌లో ఉన్న మిత్రులందరినీ కలుపుకుంటూ ఆపదలో ఉన్న మిత్రులకు ఆర్థికసాయం అందిస్తున్నారు. రూ.25వేల నుంచి రూ.1.60 లక్షల వరకు ఆర్థికసాయం అందించే స్థాయికి ఎదిగారు. ప్రస్తుతం ఈ అసోసియేషన్‌లో 150 మంది మిత్రులు భాగస్వాములుగా ఉన్నారు.

ఆడపిల్లల విద్యకు చేయూత



సింగిల్ గర్ల్ చైల్డ్ అక్షితకు స్కూల్ ఫీజు చెల్లిస్తున్న ల్యాబర్తి మిత్ర మండలి బాధ్యులు

కాజీపేట అర్బన్: వర్ధన్నపేట మండలంలోని ల్యాబర్తికి చెందిన యువత ల్యాబర్తి మిత్ర మండలిని, మనఊరు మన కోసం పేరిట ఒక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ మిత్రులంతా వివిధ వృత్తుల నేపథ్యంలో పట్టణంలో స్థిరపడినప్పటికీ గ్రామంలోని వారికి ఆపదలో చేయూతనిస్తున్నారు. రెండేళ్లుగా గ్రామంలోని సింగిల్ గర్ల్ చైల్డ్‌ను ఎంపిక చేసుకుని విద్యకు పూర్తి ఫీజును చెల్లిస్తున్నారు. గ్రామానికి చెందిన గొట్టం అశోక్ కోవిడ్‌తో మృతి చెందగా మిత్రులు, గ్రామస్తులు కలిసి రూ.3,15,700 కుటుంబానికి అందజేశారు. పోలెపాక దిలీప్ మృతి చెందగా అతడి కుటుంబానికి రూ.10వేలు అందించి తమ ఔదార్యాన్ని చాటుకుంటున్నారు. మిత్రమండలిలో అన్నందాస్ కరుణాకర్, పిన్నింటి స్వాతి, తాత శ్రీధర్, వడిచెర్ల అమరేందర్, వీరమల్ల అనిల్‌కుమార్, అన్నమనేని అనిల్, బొల్లం శేఖర్, మడత రఘు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

కలిసి చదివారు..



స్నేహితుడికి సాయం అందజేస్తున్న తోటి మిత్రులు

డోర్నకల్ : స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో 1988–89 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన నాటి మిత్రులు నేటికీ తమ స్నేహాన్ని కొనసాగిస్తున్నారు. 35 ఏళ్ల క్రితం ఎక్కడెక్కడో స్థిరపడిన మిత్రులు.. తమలోని ఎవరికి ఆపద వచ్చినా తలా ఓ చేయి వేసి ఆదుకుంటున్నారు.. ఓ స్నేహితుడి కుమార్తె వివాహానికి రూ.45 వేలు, ఓ మిత్రుడికి పక్షవాతం రాగా చికిత్స నిమిత్తం రూ.15వేలు, ఓ స్నేహితురాలి భర్తకు అనారోగ్యమైతే రూ.15 వేలు, ఓ మిత్రుడు ప్రమాదంలో గాయపడితే రూ.25వేలు, ఓ మిత్రుడు అనారోగ్యంతో చనిపోతే రూ.10 వేలతో పాటు మిత్రుల పిల్లల చదువులకు ఆర్థిక సహాయమందిస్తూ తోడుగా ఉంటున్నారు. మిత్రుల్లో మహేష్, బొర్రా శ్రీనివాస్, వీరభద్రం, కోటేష్, లచ్చు నాయక్, రవీందర్ లింగయ్య, రామాచారి ఉన్నారు.

ఐకమత్యం చాటుతున్న బాల్య స్నేహితులు



కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మిత్రుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న తోటి స్నేహితులు(ఫైల్)

మరిపెడ రూరల్: మరిపెడ మండలంలోని ఎల్లంపేట హైస్కూల్ 1992–93 ఎస్సెస్సీ బ్యాచ్‌కి చెందిన పూర్వవిద్యార్థులు 30 ఏళ్లు దాటినా కలిసిమెలిసి ఉంటున్నారు. చిన్ననాటి స్నేహితులు ఎవరు ఆపదలో ఉన్నా.. అప్పన్నహస్తం అందిస్తున్నారు. తమ పాఠశాల విద్యార్థుల కోసం బెంచీలు, రెండు సైన్స్ ప్రయోగ శాలల బల్లాలు అందజేశారు. బాల్యమిత్రుడు సాగంటి పాపయ్య మృతిచెందగా..బాధిత కుటుంబానికి రూ.50 వేలు, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న మరో క్లాస్‌మెట్ కరుణాబాయి కుటుంబానికి రూ.50 వేలు, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నడిగోటి శ్రీశైలం కుటుంబానికి రూ.25 వేలు ఆర్థిక సాయం అందించి బాసటగా నిలిచారు.

సామాజిక సేవలో 'బెస్ట్' ఫ్రెండ్స్



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాలిసెట్ పుస్తకాలు అందజేస్తున్న బెస్ట్ ఫౌండేషన్ బాధ్యులు(ఫైల్)

విద్యారణ్యపురి: వివిధ వృత్తుల్లో ఉన్న వారు ఒక గ్రూప్‌గా ఏర్పడి 'బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్' పేరుతో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ.. పలువురిచేత బెస్ట్ అనిపించుకుంటున్నారు. సుమారు వేయి మందితో క్రియేట్ చేసిన వాట్సాప్ గ్రూప్‌లోని సభ్యులు తమకు తోచినంత ఫండ్ పంపించడం ద్వారా జమ అయిన మొత్తంతో తమ ఫ్రెండ్స్‌లో ఎవరికి ఆపద వచ్చినా చేయూతనివ్వాలనుకున్నారు. కానీ, రిజిస్ట్రేషన్ అనంతరం ఫౌండేషన్ ప్రస్తుతం విద్యార్థులకు పోటీపరీక్షల పుస్తకాలు పంచడంతోపాటు ఇతర సేవా కార్యక్రమాలు చేస్తుంది. సమాజ హితం కోసం నిరంతరం సేవా కార్యక్రమాలు చేస్తామంటున్నారు బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఉపాధ్యాయుడు పులి దేవేందర్.

స్నేహానికి నిదర్శనం.. హెల్పింగ్ హ్యాండ్స్



ఆర్థికసాయం అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు (ఫైల్)

తరిగొప్పుల : స్నేహితులకు తోడుంటూ స్నేహమంటే ఇదేరా అంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు తరిగొప్పులలోని ఉన్నత పాఠశాలల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు. తమతో కలిసి చదువుకున్న మిత్రులకు ఆపత్కాలంలో ఆర్థికంగా ఆదుకుంటూ స్నేహానికి నిర్వచనంగా నిలుస్తున్నారు. 2004–05 విద్యాసంవత్సరంలో టెన్త్ పూర్తి చేసిన 66 మంది సభ్యులతో హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. తద్వారా నేటి వరకు 30 మంది స్నేహితులకు రూ.4 లక్షల పైగా అందజేసి ఆర్థికంగా ఆదుకున్నారు. గునింటి రాజపోషయ్య, కొయ్యడ శ్రీకాంత్, వంశీ, రమేష్ ముందుండి స్నేహితులను నడిపిస్తున్నారు.

మేమున్నామంటూ..



సంపత్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

తొర్రూరు: మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1984–85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆపదలో స్నేహితులకు ఆర్థిక చేయూతనిస్తూ ఆసరాగా నిలుస్తున్నారు. మేమున్నామంటూ ముందుకొచ్చి ఆపదలో ఉన్న స్నేహితులకు అండగా నిలుస్తున్నారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మిత్రుడు చాట్ల సంపత్‌కు రూ.1.3 లక్షలు, కంఠాయపాలెం గ్రామానికి చెందిన ఆర్ఎస్ చారికి రూ.50 వేలు, క్వింటా బియ్యం అందజేశారు. మిత్రుడు నాగేశ్వరావు ఆర్టీసీ కండక్టర్‌గా ఉండగా.. బస్సు యాక్సిడెంట్‌లో కాళ్లు విరగడంతో రూ.70 వేలు నాగేశ్వరరావు కుమార్తె ఫీజు నిమిత్తం అందజేశారు.

ఆపదలో అండగా..



సాయం అందజేస్తున్న స్నేహితులు

కొడకండ్ల: తమతో కల్సి చదువుకొన్న స్నేహితులకు ఆపదలో అండగా ఉంటూ తమవంతు చేయూతనిస్తున్నారు.. కొడకండ్ల ఉన్నత పాఠశాలకు చెందిన 1993–94 విద్యార్థులు. ఆరు సంవత్సరాలుగా స్నేహితుల అకాల మరణాలు, నిరుపేద స్నేహితుల కుటుంబాల్లో వివాహాలకు దాదాపు రూ.5లక్షల వరకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. 30ఏళ్ల క్రితం కల్సిమెలసి చదువుకొని వివిధ హోదాల్లో అనేక ప్రాంతాల్లో జీవనం సాగిస్తూ.. ఆపద సమయంలో స్నేహితులకు అండగా ఉంటూ ఆదర్శనంగా నిలుస్తున్నారు ఈ స్నేహితులు. గ్రూప్ చైర్మన్ పసునూరి మధుసూదన్ ప్రత్యేక చొరవ తీసుకొని మిత్రుల సహకారంతో ముందుకెళ్తున్నారు.

నీ స్నేహం..



ఏనాడు పుట్టిందో ఈ తియ్యని రాగం
ప్రతిక్షణం జ్వనించే హృదయ స్పందనం
ఎవరు పలికారో ఈ తారక వేదమంత్రం
ప్రతిమదిలో జపించే సుప్రభాతం

అనుకోని పలకరింపులు కలిపిన పరిచయం
తొలకరి చినుకులకు చిగురించిన వసంతం
ప్రతీది పంచుకునేంత దగ్గరైన ప్రయాణం
దూరంగా వెళ్లినా.. విడిపోని అనుబంధం

ఆపదలో ఆదుకునే ఆత్మీయ బంధం
కష్టాల్లో వెన్నంటే నిలిచే ధైర్యం
తిరిగి ఏమి ఆశించని నిస్వార్థ రూపం
ఏమిచ్చి తీర్చుకోను తీరని రుణం

కనిపెంచిన అమ్మ నాన్నలకు స్వరూపం
అడగకుండానే దేవుడిచ్చిన వరం
మరుపురాని జ్ఞాపకాలు రాసిన పుస్తకం
మరి మరి చదివే మధుర ప్రబంధ కావ్యం

కుల మత తారతమ్యాలకు అతీతం
పేద ధనిక అంతర భావాలు శూన్యం
ఒకగూటి పక్షుల్లా ఎగరడం నైజం
ఒకఇంటి బిడ్డల్లా ఉండటం నిజం.

- అందె భవాని

ట్రాక్టర్ ఇంజన్ కిందపడి వ్యక్తి మృతి



విష్ణు మృతదేహం

వర్ధన్నపేట: బురద దుక్కి దున్నుతున్న కౌలు రైతు ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఇంజన్ కింద పడి మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని బొక్కలగూడెంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కథనం ప్రకారం మండలంలోని ల్యాబర్తి గ్రామానికి చెందిన బడితపురం మణి అలియాస్ విష్ణు(32) సమీప గ్రామంలోని వంగపండ్ల రాములుకు చెందిన భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం బురద దుక్కి దున్నుతున్న సమయంలో తన ట్రాక్టర్ బురదలో దిగబడి పోయింది. దీంతో మరో ట్రాక్టర్‌తో లాగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఇంజన్ బోల్తా పడడంతో ఇంజన్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు రైతుల సాయంతో జేసీబీ యంత్రాన్ని రప్పించి ట్రాక్టర్ ఇంజన్ తీయగా అప్పటికే విష్ణు మృతి చెంది ఉన్నాడు. విష్ణుకు రజినక, ఇద్దరు కుమారులు ఉన్నారు. కౌలు చేసుకోవడంతో పాటు తన ట్రాక్టర్ అద్దెకు వెళ్లి జీవనం సాగిస్తున్న క్రమంలో విష్ణు మృతిచెందడంతో తల్లిదండ్రులు పద్మ ఉపేందర్, సోదరి వినిత భార్య పిల్లల రోదనలు మిన్నంటాయి.

చెరువులో పడి యువకుడు..



వినోద్(ఫైల్)

మల్హర్: ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతి చెందిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని తాడిచర్ల గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. కొయ్యూరు ఏఎస్సై కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. తాడిచర్ల బీసీ కాలనీకి చెందిన పెనుగొండ వినోద్ (30) హమాలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈక్రమంలో శనివారం ఉదయం 7 గంటలకు హమాలీ సంఘం భవనం వద్దకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య లక్ష్మి ఫోన్ చేయగా.. స్విచ్ఛాఫ్ ఉండడంతో మేనల్లుడు నవీన్‌తో కలిసి లక్ష్మి హమాలీ సంఘం భవనం వద్దకు వెళ్లి చూడగా.. కన్పించడలేదు. దీంతో పక్కనే ఈదుల చెరువు వద్దకు వెళ్లారు. బహిర్భూమి నిమిత్తం వినోద్ చెరువు వద్దకు వెళ్లి, ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి, ఈత రాకపోవడంతో నీటిలో మునిగి చనిపోయినట్లు ఏఎస్సై స్పష్టం చేశారు. వినోద్‌కు భార్య, కుమారుడు రాజుకుమార్, కూతురు రష్మిత ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసున్నట్లు ఏఎస్సై వెల్లడించారు.

వివాహిత బలవన్మరణం



శృతి (ఫైల్)

మద్దిరాల (తుంగతుర్తి) : భర్త వేధింపులతో ఓ వివాహిత ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని బలవన్మరణానికి పాల్పడింది. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం రెడ్డిగూడెంలో చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ములుగు జిల్లా మంగపేట మండలం కత్తిగూడెం గ్రామానికి చెందిన బోటమంచి శాంతయ్య కుమార్తె శృతి(32)కి మద్దిరాల మండలం రెడ్డిగూడెం గ్రామానికి చెందిన నాగెల్లి ఉపేందర్‌తో 13ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కూతురు సంతానం. ఉపేందర్ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న క్రమంలో ఉపేందర్ మద్యానికి బానిసగా మారి భార్యను చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో తీవ్ర మనస్తాపానికి గురైన శృతి శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి గ్రామ శివారుకు వెళ్లి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. గమనించిన గ్రామస్తులు మంటలు ఆర్పి సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. 90శాతం కాలిన శృతి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. మృతురాలి సోదరుడు తరుణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

మణిపూర్‌లో నాజీల పాలన

- మణిపూర్ రచయిత్రి కూర్చినా కిమ్మోవా కొంగ్సాయి



సదస్సులో మాట్లాడుతున్న మణిపూర్ రచయిత్రి

నయీంనగర్: మా తాత ముత్తాల నుంచి ఇక్కడే ఉన్నామని బ్రిటిష్ వారితో మా పూర్వీకులు యుద్ధం చేశారని మణిపూర్ రచయిత్రి కూర్చినా కిమ్మోవా కొంగ్సాయి అన్నారు. శనివారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో భారత్ బచావో సదస్సు హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు ఎస్.రామబ్రహ్మం, డి.ప్రవీణ్‌కుమార్‌ల అధ్యక్షతన నిర్వహించగా.. కిమ్మోవా కొంగ్సాయి మాట్లాడారు. తాము భారతీయులమేనని మాకు విడిపోవాలని లేదని తమని తరిమేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం హద్దుల కోసం మమ్మల్ని ఊచకోత కోస్తున్నట్లు పేర్కొన్నారు. మణిపూర్‌లో నాజీల పాలన సాగుతోందని అన్నారు. రాష్టంలోని కొండ ప్రాంతంలో ఉన్న ఖనిజ నిక్షేపాలను దోచుకొని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడానికి కుట్ర జరుగుతోందని చెప్పారు. భారత భూభాగాన్ని కొండకోనల్లో కాపాడింది కూకీలేనని మాకు ప్రత్యేక ప్రాంతం హోదా కావాలన్నారు. తెలంగాణ ప్రజలు చాలా మంచి వారని తాను 2014 నుంచి హైదరాబాద్‌లో ఉంటున్నానని అన్నారు. భారత్ బచావో జాతీయ కౌన్సిల్ సభ్యుడు గాదె ఇన్నయ్య మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని వినిపించారు. మనువాద, మతోన్మాద శక్తులు పెట్రోగిపోతున్నాయన్నారు. మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బి.సాంబశివరావు మాట్లాడుతూ ఆర్థిక, రాజకీయ, సామాజిక అంతరాలున్న దేశంలో యూసీసీ వల్ల అనేక సమస్యలు వస్తాయని అందుకే అంబేడ్కర్ యూసీసీ ని ఆర్టికల్44లో చేర్చాడని తెలిపారు. దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషా మాట్లాడుతూ ప్రజలందరు నిగ్రహం పాటించాలన్నారు. అనంతరం హనుమకొండ సీపీఐ జిల్లా కార్యదర్శి భిక్షపతి, వరంగల్ జిల్లా కార్యదర్శి ఎం.రవి, ఎంసీపీఐ నాయకుడు హంసారెడ్డి ప్రసంగించారు. భారత్ బచావో జాతీయ కౌన్సిల్ సభ్యుడు డా.ఎం.వెంగల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా, వివిధ ప్రజా నాయకులు పాల్గొన్నారు.

ఆటోల దొంగ అరెస్ట్, రిమాండ్

- రెండు ఆటోలు స్వాధీనం



నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ రాఘవేందర్

స్టేషన్‌ఘన్‌పూర్: ఆటోలను దొంగిలించే నిందితుడు దండ్ల గణేష్‌ను డివిజన్ కేంద్రంలో శనివారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపినట్లు సీఐ ఆలె రాఘవేందర్ తెలిపారు. ఈ మేరకు సీఐ విలేకర్లతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన నీరటి రాకేష్ గత నెల 30న రాత్రి తన ఇంటి ఎదుట ఆటోను ఉంచి ఉదయం చూసేసరికి లేకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ఘన్‌పూర్‌లో వీయూపీ బ్రిడ్జి వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం జూకల్లు గ్రామానికి చెందిన నిందితుడు దండ్ల గణేష్ ఘన్‌పూర్‌లో చోరీ చేసిన రాకేష్‌కు చెందిన ఆటోను హైదరాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో పోలీసులకు పట్టుబడ్డాడు. గణేష్ ప్రస్తుత నివాసం కూకట్‌పల్లి గాజుల రామారం అని, ప్లంబర్‌గా పనిచేస్తూ ఆటోలను దొంగతనం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఘన్‌పూర్‌తోపాటు నిందితుడు జూలై 30న కాజీపేటలో మరో ఆటో దొంగిలించాడని, కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తెలిపారు. గతంలోనూ సైబరాబాద్‌లోని నాచుపల్లి, గుంటూరు జిల్లా చిల్లకల్లు, కొత్తపేట పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఆటోలు దొంగతనం చేసి జైలుకు వెళ్లి వచ్చాడని తెలిపారు. నేరస్తుడి వద్ద నుంచి రెండు ఆటోలను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ మగ్దూమ్, కానిస్టేబుళ్లు కుమారస్వామి, శ్రీను, కుమార్ ఉన్నారు.